క్లుప్తంగా

గిరిజన బాలుర పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కనిగిరిరూరల్: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జిల్లాలోని ఎక్కడి నుంచైనా ఇంగ్లిష్ మీడియం లో చదివేందుకు ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 3వ తరగతిలో ఎస్టీకి 32, ఎస్సీలకు 5, బీసీలకు 2 ఓసీలకు 1 మొత్తం 40 సీట్లు ఉన్నాయని, నాల్గవ తరగతికి 33, ఐదవ తరగతిలో 32, ఆరవ తరగతికి 28, ఏడో తరగతికి 17, ఎనిమిదో తరగతికి 28, తొమ్మిదికి 8 సీట్లు ఎస్టీలకు మాత్రమే ఉన్నట్లు వెల్లడించారు. ఖాళీల సంఖ్య కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ తీస్తామన్నారు. పూర్తి వివరాలకు 8333925182, 95539 48988 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమంతునిపాడు: విద్యుత్ స్తంభాల మార్పులో భాగంగా మండల కేంద్రంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

గ్రంథాలయాల్లో ఆటపాటలతో విద్య

కనిగిరిరూరల్: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణల్లో భాగంగా నిర్వహించే ఆట పాటలతో కూడిన విద్యను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జేవీవీ నాయకుడు ఎస్కే గయాజ్ బాషా అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత విజ్ఞాన తరగతులను, ఆట పాటలతో కూడిన విద్యను బోధించారు. కార్యక్రమంలో గ్రంథపాలకు ఎస్కే అహమ్మద్ షరీఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ సుజాత

పొన్నలూరు: స్థానిక చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ డాక్టర్ సుజాత మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీల మస్టర్లలో అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా వేయాలన్నారు. వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు, మెడికల్ కిట్ అందుబాటులో ఉండాలన్నారు. సరాసరి కూలీ రూ.307 వచ్చేలా పనిచేయాలన్నారు. ఉపాధి పనులు, మస్టర్లలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఏపీఓ సుధాకర్, ఈసీ కోటేశ్వరరావు, టీఏ కుమార్ పాల్గొన్నారు.

టంగుటూరులో...

టంగుటూరు: మండల పరిధిలోని వెలగపూడి, టంగుటూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ మాచర్ల మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ ప్రతి మస్టర్‌ను పరిశీలించారు. గత వారంలో రోజుకు రూ.234 కూలి వచ్చిందని, మరో గంట పని చేస్తే రూ.300 వరకు కూలి తీసుకోవచ్చన్నారు. బీమా పథకాలపై అవగాహన కల్పించారు.

తహసీల్దార్ ఆకస్మిక తనిఖీలు



పీసీపల్లిలో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఉషా

పీసీపల్లి: మండలంలోని రేషన్ దుకాణాలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లు, రైస్ మిల్లులను తహసీల్దార్ ఉషా మంగళవారంఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తూనికలు, కొలతల్లో ఎటువంటి మోసాలకు లేకుండా ప్రజలకు అందించాలన్నారు. ఇటీవల కొలతల్లో తేడాలు ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట వీఆర్ఓ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్ల పంపిణీ



పనిముట్లను పంపిణీ చేస్తున్న ఏఓ విజయ్‌కుమార్


కొండపి: మండల పరిధిలోని వెన్నూరు రైతు సేవ కేంద్రంలో మంగళవారం ఏపీ ఆగ్రోస్ వారి సహకారంతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు వ్యవసాయ పనిముట్లను వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎంఏఎం పథకం కింద 50 శాతం రాయితీతో రైతులకు పంపిణీ చేస్తామన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య, గ్రామ వ్యవసాయ సహాయకుడు జె. కొండలరావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరదా సరదా ఈత..

కన్నవారికి గుండెకోత



గతే ఏడాది పామూరులో నీటి కుంటలో మృతి చెందిన విద్యార్థులు(ఫైల్)



కనిగిరి ప్రాంతంలో నీటి కుంటలు

- ఈత సరదాకు చిన్నారులు బలి
- ఏటా పదుల సంఖ్యలో విద్యార్థుల మృత్యువాత
- వేసవిలో అప్రమత్తంగా ఉండాల్సిన వైనం

కనిగిరి రూరల్: వేసవి సెలవుల్లో చిన్నారుల సందడికి హద్దే ఉండదు. నలుగురు పిల్లలు తోడైతే చలో అంటూ ఈతకు బయలుదేరతారు. ఆ సరదానే వారి ప్రాణాలు తీస్తోంది. పట్టణాల్లో కంటే పల్లెల్లోనే ఈత కొట్టేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి. అయితే ప్రమాదం ఉందన్న జ్ఞానం, భయం ఆ చిట్టి బుర్రలకు తట్టదు. ఒకరినొకరు పోటాపోటీగా బావుల్లో, నీటిగుంటల్లో, కాల్వల్లో దూకి చివరకు కన్నవారికి కడుపుకోత మిగుల్చుతున్నారు. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమై ఉండగా.. పిల్లలు మాత్రం ఈత సరదాతో మత్యువడి చేరుతున్నారు. ప్రతి వేసవిలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. వేసవి సెలవులు ఇచ్చిన నాల్గు రోజుల్లోనే ఓ విద్యార్థి ఈత సరదాకు వెళ్లి నీటి కుంటలో పడి ప్రాణాలు వదిలిన దుర్ఘటన ఆదివారం కనిగిరి పట్టణ సమీపంలో భూతంవారిపల్లి గ్రామంలో జరిగింది.

వేసవి సెలవుల్లో పిల్లలపై కాస్త దృష్టి సారిస్తే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడవచ్చు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గత ఐదేళ్ల నుంచి పరిశీలిస్తే.. సుమారు 18 మంది వరకు ఈతకు వెళ్లి...వివిధ ఆటలకు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి విద్యుత్ షాక్ గురై, ప్రమాదాలకు గురై మరో 7 మంది వరకు విద్యార్థులు, చిన్నారులు మృత్యువడి చేరారు.

కనిగిరి ప్రాంతంలో జరిగిన కొన్ని సంఘటనలు..

- 2025 ఏప్రిల్ 27న తాజాగా ఆదివారం కనిగిరి మండలం భూతంవారిపల్లిలో గ్రామానికి ఆనుకుని ఉన్న నీటి కుంటలోకి ఈత సరదాకోసం దిగి చిన్ని(12) మృతి చెందాడు.
- 2024లో ఆగస్టు 10న పామూరుకు చెందిన పదో తరగతి స్నేహితులు సరదాగా ఈత సరదా కోసం సీఎస్‌పురం రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న కుంటలోకి దిగి పి చరణ్, పి.గౌతమ్ మృతి చెందారు.
- 2022 జనవరి 26న రిపబ్లిక్ డే రోజున చింతలపాలెం ఉన్నత పాఠశాలకు చదివే పేరంగుడిపల్లికి చెందిన ఇద్దరు విద్యారులు మార్గమధ్యంలోని పేరంగుడిపల్లి- చిన్న ఇర్లపాడు సమీపంలో రైల్వే ట్రాక్ కోసం తీసిన నీటి గుంటలో పడి ఇండ్లా దినేష్, ఇండ్లా లోకేష్ మృత్యువాత పడ్డారు.
- 2021 ఆగస్టు 15న మండలంలోని ఏరువారిపల్లి పాఠశాలలో చదువుతున్న పీసీపల్లి మండలం బట్టుపల్లి విద్యార్థులు ఇంటికి వెళ్తూ..సరదాగా ఈత కోసం కంఠంవారిపల్లి చెరువులో దిగి మృతి చెందారు.
- గత కొంత కాలం క్రితం కనిగిరి నాగుల చెరువులో ఈత కోసం వెళ్లి ముగ్గురు విద్యార్థులు గతంలో చనిపోయారు.
- గతంలో పీసీపల్లిలో హాస్టల్ విద్యార్థులు సరదా ఈత కోసం వెళ్లి నీటి గుంతలో పడి చనిపోయారు.
- హెచ్ఎంపాడులో కూడ ఇద్దరు విద్యార్థులు ఈత కోసం మట్టి తవ్వకాల గుంతలో దిగి బయటకు రాలేక మృతి చెందారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- క్రీడా ఆటలు ఆడుకునే సమయంలో నీటి కుంటలు, చెరువుల వద్దకు వెళ్లకూడదనే నిబంధనను, జాగ్రత్తలు, హెచ్చరికలను విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కచ్చితంగా చెప్పాలి.
- సాధ్యమైనంత వరకు ఇంట్లో నుంచి పిల్లలు స్నేహితులతో బయట, దూరప్రాంతాలకు ఆడుకునేందుకు పంపించకూడదు. శివారు ప్రాంతాల వారు నీటికుంటలు, చెరువులు దగ్గర ఉన్న వాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి.
- ప్రధానంగా కనిగిరి ప్రాంతంలో పలు ప్రాంతాల్లోని నీటి కుంటలు నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నాయి. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో చిన్నారులు, విద్యార్థులు మృతి చెందిన సంఘటనలున్నాయి.
- పట్టణానికి దగ్గరగా ఉండే పెద్ద చెరువు, నాగుల చెరువు, దొరువు ప్రాంతాల్లో మృత్యుకుహరాలుగా నోర్లు తెరిచి ఉంటాయి. అక్కడ గతంలో అనేక ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఈ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. గతంలో పంచాయతీ పాలనలో ఆ ఏరియాల్లో కాపలాదారున్ని నియమించారు. దాన్ని కొనసాగించాలి.
- పల్లెల్లో గ్రామాలకు ఆనుకుని ఉన్న నీటి కుంటలు, వాగుల వద్ద పంచాయతీ, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- ప్రధానంగా కనిగిరి పట్టణానికి ఆనుకుని శంఖవరం, చింతలగ్రామం, పరిధిలో భారీ గ్రానైట్ తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడి మృత్యుకుహరాలుగా నోళ్లు తెరిచి ఉన్నాయి. అలాగే పట్టణంలోని 11వ వార్డు, 13 వార్డు క్వారీ గుంటలు నీటితో నిండి ప్రమాదభరితంగా ఉన్నాయి. ఆయా యజమానులను పిలిపించి రోడ్డు దగ్గరగా ఉన్న కుంటలకు కంచె వేయించాలి. లేదా కాపలాదారున్ని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇలాంటి తక్షణ చర్యలపై అధికార యంత్రాగం దృష్టి పెడితే భావి భారత పౌరులను కొంతమేర రక్షించుకునే వారు అవుతాం.

తగు జాగ్రత్తలు తీసుకోవాలి



సెలవుల్లో పిల్లలు ఈత సరదాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల కురిసిన వర్షాలు నీటి కుంటల్లో, చెరువుల్లో నీరు చేరాయి. సెలవు రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. చిన్నారులను, విద్యార్థులను నీటి కుంటలు చెరువులు ఉన్న చోటకు క్రీడా ఆటలు ఆడుకునేందుకు వెళ్లకుండా చూడాలి.

– విరెడ్డి రామిరెడ్డి (ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు)

తగు చర్యలు తీసుకుంటాం



పట్టణంలోని అన్ని నీటి కుంటలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం. ప్రధానంగా ప్రమాదం జరిగే దొరువు, నాగులచెరువు, పెద్ద చెరువు, పీతుల దొరువు ప్రాంతాల్లో కాపలాదారున్ని నియామకానికి చర్యలు తీసుకుంటా. గ్రానైట్, కొండ క్వారీల వద్ద ఏర్పటి కుంటల్లో నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి, క్వారీ యజమనులతో హెచ్చరిక బోర్డులు, కాపాలదారులన్ని నియమించాలని ఆదేశాలిస్తాం.

– దానియేల్ జోసఫ్, మున్సిపల్, కమిషనర్, కనిగిరి

కుమారికి ఆదిమూలపు సురేష్ నివాళి



కుమారి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపాటి నరసింగరావు భార్య కుమారి సోమవారం అనారోగ్యంతో మృతి చెందడంతో పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మంగళవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుమారి కుటుంబసభ్యులను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, జిల్లా కార్యాచరణ కార్యదర్శి కాటా మాధవరావు, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మార్తాల వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెన్నపూస శ్రీనివాసులరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి, వెన్నపూస రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

టంగుటూరు: వేసవిలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలాబాల వీరాంజనేయ స్వామి అన్నారు. మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో నీటి సరఫరా వివరాలు, సమస్యలు అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకూడదని ఆదేశించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



పార్టీ మండల అధ్యక్షులతో సమావేశమైన డాక్టర్ సురేష్

సింగరాయకొండ: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని నూతనంగా నియమితులైన మండల పార్టీ అధ్యక్షులకు పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దిశానిర్దేశం చేశారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆరు మండలాల మండల పార్టీ అధ్యక్షులతో ఆదిమూలపు సురేష్ సమావేశమయ్యారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ మండల కమిటీలు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలను నియమించుకోవాలని, మే నెలాఖరులోగా కమిటీల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో అందరి ఏకాభిప్రాయంతోనే కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండల, గ్రామ కమిటీల ఎంపికలో మండల పార్టీ అధ్యక్షులదే తుది నిర్ణయమని, ఇందులో ఎవరి జోక్యం ఉండదని వివరించారు. ప్రతి మండలంలో పార్టీ పదవులు పొందిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల అధ్యక్షుల పర్యవేక్షణలోనే పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సి ఉంటుందని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి ప్రభుత్వ పనితీరును ఎండగట్టడమే ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా ఆరు మండలాల అధ్యక్షులు తమ నియామకానికి సహకరించిన డాక్టర్ సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసులు, చింతపల్లి హరిబాబు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, బచ్చల కోటేశ్వరరావు, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి హోమం

- వైభవంగా అభిషేకోత్సవం



ఉత్సవమూర్తుల అభిషేకంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో భాగంగా మంగళవారం మహాగణపతిహోమం రుత్వికులు చిమట కార్తీక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట అభయ ఆంజనేయస్వామి మూల విగ్రహమూర్తికి, జంట నాగులు శిలలు, బలిపీఠంకు, అనంతరం సీతా, రామ, లక్ష్మణ, హనుమంత ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయంత్రం నూతనంగా ప్రతిష్ఠించనున్న మూల విగ్రహమూర్తులకు, నూతన ఉత్సవ విగ్రహ మూర్తులకు భజంత్రీల మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణాసంచా నడుమ కన్నుల పండువగా గ్రామోత్సవం సాగింది. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా దాతలు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో మహిళలకు ఆర్థిక భరోసా



శిక్షణా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

పామూరు: ప్రభుత్వం మహిళలకు టైలరింగ్‌లో శిక్షణనిచ్చి వారికి ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వడం ద్వారా వారు సొంతంగా టైలరింగ్ చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్‌లో శిక్షణకు ఎంపికైన వారు విధిగా శిక్షణ కేంద్రానికి వచ్చి శిక్షణ పొందేలా చూడాలన్నారు. ఇక్కడ ఆధునిక మోడళ్లలో టైలరింగ్‌లో శిక్షణ పొందడం ద్వారా ఎంతో ఉపయోగముంటుందన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, సిబ్బంది కేటీవీ నరసింహారావు, ఎం స్రవంతి, ఏవీఎల్.సుచరిత ఉన్నారు.

డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణంరాజు అనర్హుడు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్

కొండపి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును ఉద్దేశించి అభ్యంతరకరంగా మాట్లాడిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆ పదవికి అనర్హుడని సీపీఎం జిల్లా నాయకుడు కేజీ మస్తాన్ అన్నారు. డిప్యూటీ స్పీకర్ అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊసరవెల్లి రాజకీయాలు నడిపింది రఘురామకృష్ణం రాజేనన్నారు. రఘురామకృష్ణరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు గ్రామంలో 30 ఏళ్లకు పైగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చివేసిన ఘటనపై సీపీఎం కార్యదర్శి సందర్శించినందుకు డిప్యూటీ స్పీకర్ సంయమనం కోల్పోయి మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు. రాజ్యాంగ పదవిలో ఉన్న నాయకుడు అప్రజాస్వామికంగా మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చంద్రశేఖర్, సీపీఎం కార్యదర్శి రూబేన్, వందనం, బుజ్జి, శివ జయరాంరెడ్డి, జయరావు,బ్రహ్మయ్య, కాలేబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సందీప్‌కుమార్

హనుమంతునిపాడు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మెడికల్ అధికారి దార్ల సందీప్ కుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశావర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో వడ దెబ్బ సోకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలన్నారు. క్యాన్సర్, మలేరియా, కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్ వైర్లు, డి.చెన్నయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన



పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

జరుగుమల్లి(సింగరాయకొండ): రైతులు మట్టి నమూనాలు సేకరించి పరీక్షించడం ద్వారా భూమిలో ఏ మోతాదులో పోషక విలువలు ఉంటాయో తెలుసుకోవచ్చని ఏఓ యుగంధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వ్యవసాయాధికారులు, గ్రామ సహాయకులు, రైతులకు మట్టి నమూనా సేకరణ పై అవగాహన కల్పించారు. పొలాల్లో మట్టి నమూనాలు ఏ విధంగా సేకరించాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పడిపోతున్న లోగ్రేడ్ ధరలు



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలంకేంద్రంలో లో గ్రేడ్ పొగాకు ధర రోజు రోజుకు పడిపోతుంది. 2024–25 సీజన్‌కు సంబంధించి పొగాకు వేలాన్ని గత నెల పదో తేదీన ప్రారంభించారు. ప్రారంభ రోజు పొగాకు గరిష్ట ధర కేజీ రూ 280, కనిష్ట ధర రూ.260 నమోదైంది. మూడో రౌండ్ పొగాకు వేలం మధ్య దశకు వచ్చేసరికి కనిష్ట ధర రూ .219గా నమోదయింది. రోజురోజుకు పొగాకు ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలానికి తీసుకువచ్చిన బేళ్లలో రోజుకు వందకు పైగా బేళ్లను వ్యాపారులు తిరస్కరించడంతో బేళ్లను మరొకసారి వేలానికి తీసుకురావడానికి ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరగడంతో అప్పులు చేసి పొగాకును సాగు చేశారు. వేలంలో ఆశించిన మద్దతు ధర పలికి పెట్టుబడి ఖర్చులు వస్తాయనే ఆశతో రైతులు ఉండగా, ధరలు తగ్గడంతో రైతులు ఆశలు అడియాశలవుతున్నాయి. పొగాకు బోర్డు అధికారులు బయ్యర్లతో సంప్రదింపులు చేసి ఎక్కువ ధరకు పొగాకును కొనుగోలు చేయాలని కోరుకుంటున్నారు. అధికారులు మొక్కుబడిగా వేలం కేంద్రాలకు పరిశీలనకు వచ్చి వెళుతున్నారే తప్ప రైతుల గోడు ఆలకించడం లేదని వాపోతున్నారు.

పొగాకు కనిష్ట ధర కేజీ రూ 219.

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ.219 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 901 బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. అందులో 765 బేళ్లు కొనుగోలు చేయగా 136 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.261.19గా నమోదైంది. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

122 పొగాకు బేళ్ల తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం జరిగిన వేలంలో 122 పొగాకు బేళ్లు తిరస్కరించారు. మల్లవరప్పాడు, గొర్లమిట్ట, మట్టిపాడు, శివపురం గ్రామాలకు చెందిన రైతులు 671 బేళ్లను వేలానికి తీసుకురాగా 549 బేళ్లను కొనుగోలు చేసి 122 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.215, సరాసరి ధర రూ.256.55 పలికింది. వేలంలో 20 మంది విప్యారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

పామూరు: బాల్య వివాహాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీఓ పి.సరోజిని, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని ఇనిమెర్లలో మంగళవారం బాల్య వివాహాల నియంత్రణ, బాలల అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన కార్యక్రమం, అవగాహణ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు నేరమన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. బడిఈడు పిల్లలను విధిగా పాఠశాలకు పంపాలని, బాలికల విద్యతోనే ఇంటికి వెలుగు సాధ్యమని ప్రతి ఒక్కరూ బాలికలను విద్యవైపు ప్రోత్సహించాలన్నారు. ఎక్కడైనా బాలికల అక్రమ నిర్బంధం, అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే ఐసీడీఎస్, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, పీఎస్ నాగేశ్వరరావు, ఎన్‌జీఓ షేక్. నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇనిమెర్లలో అవగాహన ర్యాలీ చేస్తున్న సీడీపీఓ, ఎంపీడీఓ